# ఇదో సోలితి కధ

23.5.84

జీవం. జనం. వెధవ జనం. పాడు జనం. ఇదేమిటండి ఈ జనానికి కామన్‌సెన్సుందా ? ప్రపంచానికి నాగరికతను నేర్పింది మనం. శ్రమ జీవితానికి సంకేతం మనం తత్త్వంలో, ప్రతి విషయంలో మనం ముందున్నాం. కానీ ఇప్పుడు వీళ్ళంతా సోమరిపోతులు. వీళ్ళలో ఒక్కడు పని చేయడు. మీ రేమనుకున్నాసరే, బియ్యం పుచ్చి పోతా యనే పుట్టారు. అవునండీ. నేను నిజంగానే అంటుంట. ఏమి జనమండీ బాబు. రైలెక్కుదామంటే, పార్కు కెళ్ళాలంటే, కనీసం సినిమా కెళ్ళాలంటే అబ్బబ్బా. చా. చా. చా. అదేం కాదు కానీ జనాన్ని తిడుతున్నానని కాదు. వాళ్ళతో ఏదైనా భరించొచ్చు కానీ ఆ మురికిని మాత్రం. ఏమిటండి నేర్పటం. ఈ జీవితంలో వారికీ మురికి వదలదు. ఒక్కోసారనిపిస్తుంది ఏ అమెరికా లోనో పుట్టక. ఇక్కడెందుకు పుట్టానా అని.''

ఇవన్నీ రావుగారికి ప్రజానీకంమీదున్న. అభిప్రాయాల్లో కొన్ని భాగాలు ఆయన మానవ జీవితాన్ని గురించి చర్చిస్తే, ముగింపుగా విదేశాల్లో పుట్టక పోవటమే నేరమనే విషయం గుర్తు చేస్తారు. ఆయన ఇంకా చాలా చాలా భావాలు వెల్లడిస్తుంటారు. అయా సందర్భాలలో మాత్రం చెలరేగి పోతారు. ఆయనకు ప్రజల మీద ఇంత ద్వేషం ఎందుకు పెరిగిందో ఎవరికీ తెలియదు.

అయితే ఆ మురికివారే ఆయన ఇల్లు కట్టారు. అది వూరికి దూరంగా విసిరి వేయబడినట్లుంటుంది. ఆ భవనం చుట్టూ ఎత్తైన ప్రహారీ గోడ ఉంది. ఆ గోడలోపల అందమైన పచ్చిక బయలు ఉంది. విశాలమైన వృక్షా లున్నాయి. అవి చల్లని గాలి నిస్తాయి. ఆయన భవనంలోకి రావటానికి అందరికీ అవకాశం ఉండదు. ఆయన గొప్ప తాత్త్వికుడు. అందుకని ఆ అభిరుచి ఉన్న వారికే అందులోకి ప్రవేశం లభిస్తుంది. ఆయన తాత్త్వికదృక్పథం గురించి కథలు చెప్పుకుంటారు. లోకంలోని అన్యాయాల్ని, అక్రమాల్ని, మనుషుల్లోని స్వార్థాన్ని, వివిధ కోణాల్ని ఆయన విశ్లేషిస్తారు.

ఆయన కయితే ఈ మానవ ప్రపంచాన్ని వదిలి అడవుల్లో ఉండాలనిపిస్తుందంటారు. ఇంకా సాంసారిక బంధాలు పట్టి ఉంచుతున్నాయి. ఆయన ఇంటిలో గొప్ప చిత్రా లున్నాయి. స్వయంగా ఆయన గొప్ప చిత్రకారుడు కూడా.

ఆయన వేసిన చిత్రాల్లో ఎక్కువగా ఆయన తాత్త్వికదృక్పథం గోచరిస్తుంటుంది. ప్రకృతి అందాలు రంగుల్లో మనోహరంగా చిత్రీకరిస్తా రాయన. కొండలు. లోయలు. ఎగిరే పక్షుల సముదాయాలు, తామరాకుల మీద నీటి బొట్లు. ఇవన్నీ ఫ్రేముల్లో బంధించబడి ఉంటాయ్. అంత విశిష్టంగా ఉండే రావుగారు, అంత హుందాగా ఉండే ఆయనే ప్రజల విషయంలో ఆయా స్వభావాల్ని కోల్పోతారు. ఆయన ప్రజల్ని తప్పితే ఎవర్నయినా ప్రేమించగలరు. ఆయన చిత్రాల్లో ఇంకా బాటసారు



సంధ్యాలక్ష్మణ్

లుం టారు. అనంత విశ్వం లోకి వారు పయనిస్తుంటారు. అస్తమిస్తున్న సూర్యుడో, ఉదయించే అరుణతారో బ్యాక్ డ్రాప్‌గా ఉంటారు. ఆ విశాల విశ్వంలోకి ఆ బాటసారుల అనంత ప్రయాణం. అంతకు మించి ఆయన చిత్రాల్లో మానవ జాతి ప్రసక్తి ఉండదు!

• • •

రావుగారికి ఒక పని మనిషి ఉన్నాడు. అతనే అన్ని పనులు చేస్తుంటాడు. పాలు తేవటం దగ్గర నుండి ఇంట్లోకి అవసరమయ్యే పనులన్నీ అతనే చెయ్యడం. రావుగారి పిల్ల లందరూ పెళ్ళిళ్ళు అయిపోయి మంచి ఉద్యోగాల్లో స్థిరపడి. వేరు వేరు చోట్లలో ఉంటున్నారు.

రావుగారు మాత్రం రిటైరై వూరికి దూరంగా ప్రశాంతంగా బతుకుతున్నారు. ఆయన ప్రశాంతకరమైన జీవితానికి ఆయన తింటున్న ప్రతి మెతుకూ పండించే వ్యక్తులూ. ప్రతి క్షణం ఆయన ఉపయోగించే వస్తువులన్నింటిలోనూ,ఆఖరుకు ఆయనతాత్త్విక దృక్పథంలోనూ ఇమిడి ఉన్న సజీవ మానవ సంబంధాల పట్ల ఆయనకు ద్వేషం. ఇంకా ప్రశాంత జీవితాన్ని కోరుకునే మరి కొందరు రావుగారి ఇంటికి కొంత దూరమే అయినా, ఆ చుట్టుపక్కలే ఇళ్ళు నిర్మించుకున్నారు. ఆ గృహాల్లో కనిపించేభాగ్యాలకు. అందాలకుసామాన్యుడు మైమరచి పోతాడు ఆశ్చర్యపోతాడు ఈర్ష్య పడతాడు కూడా.

• •

రావుగారు ప్రశాంతంగా నిద్ర పోతున్నారు. గతంలో ఆయన ఎప్పుడో మిలిటరీలో పనిచేశారు. అందుకు గుర్తుగా కాబోలు ఆ గోడలకు ఒక తుపాకీ వేలాడుతూంది. అది పనిచేస్తుందో లేక అలంకారానికి పెట్టారో కాని గంభీరంగా ఉంది. చల్లని పిల్లగాలులు తీసుకొస్తున్న అపురూప అనుభవాన్ని నిద్రలోనే ఆయన చిరునవ్వు వెల్లడిస్తూంది. ఆకాశం నిండా చుక్కలు మెరుస్తున్నాయి. వెన్నెల నిర్మలంగానే ఉంది. ఆ భవనం మీద, వృక్షాలమీద పడి మరింతగా అందాన్ని పులుముకుంటూంది. ఆ ప్రశాంతతను భగ్నం చేస్తూ ఏవో మోతలు. మెల్లగా ప్రారంభం అయ్యాయి. రావుగారి భార్యకు మొదట మెలకువ వచ్చింది. శబ్దాలు మరింతగా పెరిగాయి. రావుగారు విసుగ్గా లేచారు.

పేళ్ళు పగలేసే శబ్దాలు!
తమ తలుపుల దగ్గర్నుండే!

చక్కటి టేకుతో, అందంగానూ, బలంగానూ నిర్మించబడ్డ తలుపు ముక్కలు ముక్కలుగా విరిగి పోయింది. చేతిలో గొడ్డళ్ళు, కత్తులు, బరిసెలతో దాదాపు పదిమంది ప్రవేశించారు. వారి ముఖాలకు ముసుగు లున్నాయి. నల్లగా, భయంకరంగా కనిపిస్తున్న వారిని చూడగానే రావుగారి భార్యకు భయంతో శరీరం జలదరించింది. రావుగారు నోటి వెంట మాట రాక దిగ్భ్రాంతితో చూస్తుండి పోయారు. వాళ్ళు దగ్గర కొచ్చారు.

"తాళాలియ్యి..." బొంగురు కంఠంతో అడిగా డొకడు.

రావుగారికి అప్పుడు చలనం వచ్చింది.

"దొంగలు... దొంగలు... రక్షించండి,

"ఫట్... ఫట్."

తలమీద, భుజం మీద దెబ్బలు పడ్డాయి. రక్తం కారుతుండగా కూలి పోయా డాయన.

'ఆగండి. ఆయన్నేమీ చెయ్యకండి. తాళాలిస్తాను." బావురుమంటూ దిండు కింది తాళా లిచ్చి వేసింది.

వాళ్ళు క్షణాల్లో ఇల్లంతా దోచుకున్నారు. సామానంతా. చిందర వందర చేశారు. ఆయన ప్రకృతి చిత్రాలు చిరిగి పీలికలయి వెక్కి రిస్తున్నాయి. వారు ఆఖరికి ఆమె వంక తిరిగారు. ఆమె చేతుల కున్న గాజులన్నీ తీసి ఇచ్చింది. మెడలో గొలుసు తీస్తున్నప్పుడు కన్నీరు పెల్లుబికింది.

ఏమనుకున్నారో "సరే, అందుంచుకో" అని వెళ్ళిపోయారు. ఆ ఇంటిలో జరుగుతూంది తెలిసో, తెలియకో ఎవరూ రాలేదు. ఆ చుట్టు పక్కల ఉన్న నాలుగు ఇళ్ళూ కొళ్లగొట్ట బడ్డాయి.

రావుగారి తలకు బలంగా దెబ్బ తగిలింది.

ఆయన ఇంకా ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతిని కోల్పోలేదు. ఆ పరిస్థితుల్లోనూ ఆయన ఆలోచనలు సాగుతున్నాయి.

అవును! తను రక్షించమని ఎవర్ని పిలిచాడు!

ఏ ప్రజలు వచ్చి రక్షించగలరు?
ఏ ప్రజలు ఎందుకు రక్షించాలి?

ప్రజల్ని ఇంతగా ద్వేషించే తాను వారి సహాయం కోసం ఎందు కింతగా ఆరాట పడ్డాడు?

అనుకుంటుండగానే స్పృహ తప్పింది.

★

నవసాహితి '84 ఏప్రిల్ సాహితి జల్లులు

| | |
|---|---|
| శ్రీమతి మాదిరెడ్డి సులోచన చిట్టచివరి ఆఖరి నవల **యక్షగానం** – 17-00 | కడుపుబ్బ నవ్వుకునేలా రూపుదిద్దిన యర్రంశెట్టి శాయి **హ్యూమరాలజీ** – 18-00 |
| ముగ్గురు రచయితల మహోబ్రహ్మాస్త్రం యండమూరి వీరేంద్రనాథ్ వీరభద్రరావు పమ్మి, ఓ. ప్రభాకర్ **దేవుడా-నీ కులమేమిటి?** - 15-00 | సైన్స్ ఫిక్షన్ నవల మైనంపాటి భాస్కర్ **బుద్ధిజీవి** – 12-50 |
| నేటి కాలపు యువతీయువకుల స్వభావాలను అద్దంపట్టిన వినూత్నరచన పోల్కంపల్లి శాంతాదేవి **సంధ్యా కళ్యాణం** – 15-00 | వ్యవస్థ పతనాన్ని అతి సహజంగా చిత్రించిన నవల కొమ్మనాపల్లి గణపతిరావు **హంసధ్వని** – 20-00 |

పుస్తకం ధరలో 10/- రూపాయలు M.O.చేయండి.
మిగిలిన ఎమౌంట్‌కు V.P. లో పుస్తకం పంపగలము.

నవసాహితి బుక్ హౌస్
ఏలూరు రోడ్, విజయవాడ-520002

Bachi PRAGATI

కమ్మ వారి యింట
కన్నుల పంటలాంటి జంటలకు
రాచబాట!

మీ అబ్బాయి పూర్తి వివరాలు
యివ్వండి చాలు! తగిన సంబంధాలు వచ్చి
మీ తలుపులు తట్టుతాయి!
మీ గురించి, మీ అమ్మాయి గురించి
చెప్పండి మేలు!
తగిన వరుల వివరాలు
తెలియ జేస్తాము!

LOVELY & LIVELY
MATCHES FOR
ALL AGE GROUPS OF
KAMMA CASTE!



కాకతీయ
ఇన్ఫర్మేషన్ సర్వీస్
రాజేంద్రనగర్, 1వలైన్, గుడివాడ-521301, Ph: 940

Bachi SHAH